# గ్యాలెంట్రీ

## అడివి సూర్యకుమారి

**ప్రాణాలకు సైతం తెగించి అత్యంత ధయిర్య సాహసాలు ప్రదర్శించిన ఇన్స్పెక్టర్ బలరాంకి పోలీసు డ్యూటీ మీట్‌లో ముఖ్యమంత్రి హైద్రాబాద్ పెరేడ్ గ్రౌండులో 'గ్యాలెంట్రీ' అవార్డు ప్రదానం చేశారు.**

"అయ్యయ్యో! పడిపోయాడు, పడిపోయాడు."

ఆందోళనతో కూడిన అరుపులు కేకలు

చెరువుకు ఒక ప్రక్కగా

మంచినీరు తీసుకొనే వైపుకి కుడి ప్రక్క దూరంగా బాగా ఎత్తుగా వున్నది గట్టు. ఆ గట్టుమీదా, ప్రక్కలా జనం బారులు తీర్చి ఒకరి భుజం మీదినుండి మరొకరు నెట్టుకుంటూ, తోసుకొంటూ ముందుకు తొంగి చూస్తున్నారు.

'ఏమైంది? ఏం జరిగింది?'

వెనకవాళ్ళు ముందు వాళ్ళని ప్రశ్నిస్తున్నారు. ముందుకు పరిగెత్తడమేగాని, వెనకవాడి ప్రశ్నకు జవాబివ్వటం లేదు.

వీధుల్లో పరుగులు

ఏం జరిగిందో ఎవరికీ సరిగ్గా తెలియదు.

ముందు వాళ్ళేదో జరిగిందని పరిగెడుతున్నారు. వాళ్ళ వెనక పరిగెత్తడం తప్పమరేమీ తెలీని జనం.

"రామనాథం మాష్టారి అబ్బాయి చెరువులో పడ్డాట్ట" ఎవరో అంటూ పరిగెట్టారు.

"రామనాథం".

'ఏదీ! మాష్టారుగారబ్బాయా?'

'ఆ!'

'ఎన్నోవాడు?'

'వాళ్ళాఖరి అబ్బాయి'.

'కాస్త బక్కపలచగా వుంటాడు. ఎర్రగా వుంటాడు. సిక్త్స్‌క్లాస్ చదువుతున్నాడు.

'అబ్బ! ఔనండి, వాడే!'

'ఎట్లా పడ్డాట్ట?'

అది తెలిస్తే ఇలా పరిగెత్తటం దేనికి? ఎలా పడ్డాడో కనుక్కోవటానికే?'

చెరువు గట్టుకి పరుగులాటి నడకతో చేరుకొన్నారు.

'అదిగో...పిల్లాడి చొక్కా' అరిచారెవరో.

'అదిగదిగో తలకాయ కాళ్ళవిగో..''

'అయ్యో? ఊపిరాట్టం లేదుగాబోలు బిడ్డకి' ఓ ఉయ్యాలి ఆవేదన.

'పిల్లాడు పూర్తిగా లోపలికి పోతున్నాడు. నా పిల్లాణ్ణి ఎవ్వరూ పైకి తేలేరా? అయ్యో! నా పిల్లాడు నాకు దక్కడా? మురళీ! నాయనా! నీకు నూరేళ్ళూ అప్పుడే నిండాయిరా? నేనెల్లా బతకన్రోయ్?" మాష్టారి భార్య అడుగుతోంది. ఏడుస్తోంది. గట్టుమీద కూలబడి గుండెలు బాదుకుంటోంది.

మాష్టారు అచేతనంగా నిలబడి నీళ్ళవంకే చూస్తున్నాడు. పిల్లాడు చేపపిల్లలా అక్కడక్కడా తేలుతున్నాడు. వాడి ప్రాణం వుందో పోయిందో తెలీయకుండా వుంది. గట్టుమీద జనం ఊపిరి బిగబట్టి వాడికేసి చూస్తున్నారు.

"ఇంకా ప్రాణం ఉందనుకోను"

"వాడి ప్రాణం ఎంతండీ ఈ ప్రవాహం ముందు'

'ఎన్ని నీళ్ళు మింగాడో'

'అక్కడ మరీ లోతెక్కువ. గజ ఈతగాళ్ళే గాభరా పడతారాయే. ఈ పసివెధవ ఎప్పుడో అడుక్కుపోయుంటాడు.

'అడుక్కు ఎలాపోతాడయ్యా, చచ్చినవాడు తేల్తాడుగానీ, అదిగో... అదిగో... అటుచూడు అక్కడ... అక్కడ తెల్లగా తేలటం లేదూ'.

'ఔను సుమీ! అయినా ఈ వైపునుండి పడి ఎవరైనా బతికి బట్టకట్టారా?'

ఇంతలో...

ఇన్స్పెక్టర్‌గారి మోటార్‌సైకిలు దడదడమనే చప్పుళ్ళతో ఆయన రాకని తెలియచేసింది.

"తప్పుకోండి... తప్పుకోండి.'

'ఇన్స్పెక్టర్‌గారు... ఇన్స్పెక్టర్‌గారు?

గుంపుగా నిలబడ్డ జనంలో పిల్లా పెద్దా అందరూ పక్కకి తొలిగి ఇన్స్పెక్టర్‌గారికి దారిచ్చారు.

"ఏమైంది? అంతా యిలా మూగారేం?"

అడుగుతూనే ఆయన ఠీవీగా పరి జనం మధ్య నుండి వచ్చే రాజుగారిలా వచ్చాడు.

"పిల్లాడు ...పిల్లాడు నీళ్ళల్లో మునిగిపోయాడండీ" ఎవరో గొంతుపెగుల్చుకున్నారు.

'ప్రాణం ఉందీ లేందీ తెలీటం లేదు' అన్నారు మరొకరు.

ఆయన గట్టు అంచున నిలబడి నీళ్ళలోకి తొంగి చూశాడు.

ఆయనతోపాటు అంతా మళ్ళీ తొంగి చూడసాగారు.

అంతే...

ఇన్స్పెక్టర్‌గారు జగదేకవీరుడిలా అంతెత్తుగట్టు మీదినుండి హఠాత్తుగా నీళ్ళలోకి దూకేశారు.

జనం ఒక్కక్షణం బిత్తరపోయారు. తర్వాత తేరుకొని ఆయన సాహసానికి చప్పట్లతో ఈలలతో తమ హర్షాతిశయాన్ని తెలియచేశారు.

కొన్ని క్షణాలు ఆయన కనపళ్ళేదు. జనంలో మళ్ళీ కలకలం.

"అయ్యో! ఇన్స్పెక్టర్‌గారు కూడా పాపం!"

మాట పూర్తికాకుండానే ఆయన కాకిపాంటు అల్లంత దూరంలో కనిపించింది. తల కూడా దాంతోటే పైకి లేచింది.

జనం ఆయన పోతున్న దిక్కుగా చెరువుకట్టమీద బారుగా పరిగెత్తసాగారు.

చివరి కొకచోట ఇన్స్పెక్టరూ, ఆయన నడుం పట్టుకొన్న కుర్రాడు కట్టమీదికి పోతున్న దుబ్బు మొదలుపట్టుకొని లేవటానికి ప్రయత్నిస్తుండగా.

జనంలోని భారీ మనుషులు నలుగురు చేతులందించి పైకి లాగారిద్దరినీ.

పిల్లాణ్ణి తల్లితండ్రి అందుకున్నారు.

ఆ నల్గురూ ఇన్స్పెక్టర్‌గారిని చేతులమీద ఎత్తేసి ఊరేగింపుగా కొంతదూరం తీసుకొచ్చి తమ కృతజ్ఞతలు తెలుపుకొన్నారు.

కొంచెం నీళ్ళు తాగినా పిల్లాడు తల్లిదండ్రులతో బాగానే మాట్లాడుతున్నాడు.

"సమయానికి ఇన్స్పెక్టర్‌గారు దేవుడిలా వచ్చి బైటికి లాగారుగాని, లేకపోతే ఈ పాటికి..."

"ఔను మరి, ఇంతమంది మూగారే తప్ప ఒక్కరైనా ఆయనలా సాహసించి దూకారా?"

"ఎలా అయినా ఇన్స్పెక్టరంటే ఇన్స్పెక్టరే"

"ఏమైనా కుర్రాడి ఆయుష్షు గట్టిది. ఆయన వీడికి ప్రాణంపోశారు రామనాథంగారూ" అన్నారంతా.

'ఇంతకీ నువ్వెలా పడ్డావోయ్ మురళీ!' అడిగారు కుర్రాణ్ణి—

"నేను గట్టుమీద నుంచొని నీళ్ళలోకి పడవ లేస్తుంటే వెనకాలనుండి వచ్చి నన్నెవరో నీళ్ళలోకి నెట్టారండీ' అన్నాడు మురళి.

"మిడిమాలపు పిల్లలు, మిడిమాలపు బుద్ధులుగాకపోతే నెట్టడం ఏ మాయరోగం, వాళ్ళ చేతులు పడిపోను. ఆయన మా పాలిట భగవంతుళ్ళా రాబట్టి నా బిడ్డ నాకు దక్కాడుగాని లేకపోతే..." అని మరోసారి కన్నీరు పెట్టసాగింది రామనాథంగారి భార్య.


"సరిసరి జరిగిందేదో జరిగింది. ముందాతడి బట్టలు విప్పి వాడి తల శుభ్రంగా తుడిచి ఇంత పసుపు నెత్తిన

రాచి సాంబ్రాణి పొగ వేయండి' అందో వృద్ధురాలు.

సంతోషంతో భార్యా పిల్లలతో ఇల్లు చేరారు మాష్టారు.

ప్రాణాలకి సైతం తెగించి అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఇన్స్‌పెక్టర్ బలరాంకి పోలీసు డ్యూటీమీట్‌లో ముఖ్యమంత్రి తమ స్వహస్తాలతో హైద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్‌లో 'గ్యాలెంట్రీ' అవార్డు ప్రదానం చేశారు. అమితోత్సాహంతో మర్నాడు డ్యూటీలో ప్రవేశించాడు ఇన్స్‌పెక్టర్ బలరాం.

ఊరివాళ్ళు ఇన్స్‌పెక్టర్ బలరాంకి అభినందన సభ ఏర్పాటు చేసి తమ వంతు కృతజ్ఞతని, తమకు ఆయనమీద వున్న గౌరవాన్ని తెలియపరిచారు.



రోజూ సాయంకాలం చెరువుగట్టు వైపొచ్చి గట్టుకి అల్లంత దూరంలో ఆడుకొంటున్న పిల్లల్ని ఓ పావుగంట పరిశీలించేవాడు ఇన్స్‌పెక్టర్.

ఆయన తమని అలా పరీక్షగా చూడడం గమనించి బెదిరిపోసాగారు పిల్లలు.

ఇలా పిల్లల్ని రోజూ పరీక్షించటం ఆయన దినచర్యలో ఒక భాగమైంది.

అది చూసిన పెద్దలు కొందరు.

"మంచిపని చేస్తున్నాడు. లేకపోతే కుర్రవెధవలు, మనమాట వింటారుటండీ, ఆయన భయానికైనా గట్టు సమీపానికి పోరు."

"ఔనౌను" సమర్థించారు మిగతావాళ్ళు.

మామూలుగా పిల్లల్ని పరీక్షించి వెళ్తొన్న ఇన్స్‌పెక్టర్‌గారికి రామనాథం మాష్టారు ఎదురయ్యారు.

"నమస్కారమండీ ఇన్స్‌పెక్టర్‌గారూ!" మోటార్‌బైక్ ఆపుకొని నిలబడ్డాడు ఇన్స్‌పెక్టర్.

"మీ పేరు చెప్పుకోని రోజు లేదంటే నమ్మండి! ఊరు ఊరంతా మీ ధైర్యానికి అబ్బో! ఏం పొగుడ్తున్నారనీ!"

చిద్విలాసంగా నవ్వాడు ఇన్స్‌పెక్టర్.

"ఏమిటి రోజూ మీరు పిల్లల్ని పరీక్షిస్తున్నారుట. పిల్లలు స్కూల్లో ఈ విషయమై ఒకటేగా అనుకుంటున్నారు'

"ఔనండీ. మీ అబ్బాయిని నీళ్ళల్లోకి నెట్టిన వాడెవడై వుంటాడా అని వెతుకుతున్నా."

"ఆ! పోనివ్వండి కుర్రవెధవ. ఆకతాయి తనం కొద్దీ ఎవడో నెట్టుంటాడు. పిల్లలు పిల్లలు కొట్టుకోవడం, తిట్టుకోవడం, తోసుకోవటాలు యివన్నీ మామూలేగదండీ, ఆ కుర్రకుంకకోసం మీ అమూల్యమైన కాలాన్ని వినియోగిస్తున్నారా? పోనీండి పిల్లసన్యాసిని, వదిలెయ్యండి'.

'మీరన్నది నిజమేననుకోండి. పిల్లల పనులు పిల్లల వరకే పరిమితమైతే బాగుంటుందిగాని పెద్దవాళ్ళతోనే చెలగాటాలూ?'

'పెద్దవాళ్ళతోనా?' ఆశ్చర్యంగా చూశారు మాష్టారు.

'ఔను. ఆరోజు మీ వాణ్ణి నీళ్ళల్లోకి నెట్టినవాడే నన్నూ నెట్టాడని నా అనుమానం."

తెరచిన నోరు మూయడం మరిచిపోయాడు రామనాథంగారు.

(ఒక జోక్ ఆధారంగా). *